సాక్షి ఖమ్మం

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



లోపాలు.. శాపాలు

సారపాక – రుద్రంపూర్ మార్గంలో హైవే పనులు తొమ్మిదేళ్లుగా పూర్తికాకపోవడంతో వాహనదారులు అవస్థ పడుతున్నారు. 10లో



చెప్పుచేతల్లో పెట్టుకునేందుకే..

వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు కేంద్రం 'జమిలీ' పాట పాడుతోందని మాస్‌లైన్ నేత పోటు రంగారావు ఆరోపించారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం 35° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. కొన్నిచోట్ల ఉదయం నుంచే ఉష్ణోగ్రతల ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పత్తి, వరి పంటల పరిశీలన



పత్తిని పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య, అధికారులు

కొణిజర్ల: మండలంలోని తుమ్మలపల్లిలో గురువారం జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, వైరా ఏడీఏ కరుణశ్రీ, పర్యటించారు. ఈ సందర్భంగా వరి, పత్తి పంటలను పరిశీలించి సస్య రక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. ఉష్ణోగ్రత పెరగడంతో పత్తి రసం పీల్చే పురుగు ఉధృతి కనిపిస్తోందని, ఇటీవల వర్షాలు అనంతరం రైతులు యూరియా వాడడంతో రసం పీల్చే పురుగు పెరిగిందని తెలిపారు. అంతేకాక అక్కడక్కడా మెగ్నీషియం లోపం కనిపిస్తోందని చెప్పారు. ఈమేరకు రసం పీల్చే పురుగు నివారణకు వేప సంబంధిత పురుగు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే, వరిలో అగ్గి తెగులు, సుడి దోమ వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఆతర్వాత డీఏఓ పుల్లయ్య తనికెళ్లలోని రైతు వేదిక నుంచి డిజిటల్ క్రాప్ సర్వే విధివిధానాలపై వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. వచ్చే వారం నుంచి ప్రతీ ఏఈఓ తన పరిధిలో ప్రతీ రైతు వివరాలతో పాటు భూమి ఫొటో అప్‌లోడ్ చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ సూచించారు. ఏఓ డి.బాలాజీ, ఏఈఓలు కుమారరాజా, హర్షవర్ధన్, ఆఫ్రిన్, సరిత, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

3నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన అక్టోబర్ 3వ తేదీ నుంచి పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. విద్యార్థులకు థియరీ పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2–30నుంచి 5–30 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. అలాగే, ఇంటర్ విద్యార్థులకు వచ్చే నెల 16నుంచిప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు WWW.TELANGANAOPENSCHOOL.ORG వెబ్‌సైట్ లేదా అభ్యసన కేంద్రాల నుంచి హాల్ టికెట్లు తీసుకుని, ఆధార్‌కార్డు జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 80084 03522 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మెడికల్ కాలేజీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను గౌరవ వేతనం పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 29 సాయంత్రం 4గంటల్లోగా ఆన్‌లైన్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్హతలు, ఇతర వివరాలను www.gmckhammam.gov, https//:khammam.telangana.gov.in వెబ్‌సైట్లలో పొందుపర్చినట్లు తెలిపారు. జనరల్ సర్జరీ విభాగంలో ఏడు, గైనకాలజీ, జనరల్ మెడిసిన్‌లో ఐదు చొప్పున, రేడియో డయాగ్నోసిస్‌లో నాలుగు, పీడియాట్రిక్స్‌లో మూడు పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాక అనాటమీలో సీనియర్ రెసిడెంట్లు, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్–టాక్సికాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, అనస్తీషియాలజీలో రెండేసి పోస్టులు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

పెసల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



పెసల నాణ్యతను పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన పెసల కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు సూచించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నాణ్యమైన పెసలను తీసుకొస్తే ప్రభుత్వం నిర్ణయించిన రూ.8,682 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్, డైరెక్టర్లు కుంచె వెంకటేశ్వర్లు, తోళ్ల కోటయ్య, మారుతీ ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫోకస్

నిరంతరం శ్రమిస్తున్నా....



సాగర్ ప్రధాన కాల్వ వద్ద కొనసాగుతున్న మరమ్మతులు

కాల్వలు దెబ్బతిన్న చోట మరమ్మతు పనులను వారం రోజులుగా చేపడుతున్నారు. ఇంజనీర్ల పర్యవేక్షణలో మూడు షిఫ్ట్‌లుగా 24గంటలూ పనులు చేస్తున్నారు. దీంతో పాటు పాలేరు పాత కాల్వ సైతం గండి పడడంతో చేపట్టిన పనులు గురువారం ఓ కొలిక్కి వచ్చాయి. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు మార్లు పనులను పరిశీలించి వేగం పెంచాలన్న ఆదేశాలతో పాత కాల్వకు గురువారం పాక్షికంగా నీరు విడుదల చేశారు. ఇప్పటికే సాగర్ నీరు పది రోజులు పైగానే నిలిచిపోగా, మరమ్మతులు పూర్తయ్యేందుకు ఆదివారం దాటొచ్చని తెలుస్తోంది. ఆ రోజు నీరు విడుదల చేసినా పొలాలకు చేరడానికి పది రోజులు పడుతుంది. దీంతో సాగర్ నీరే ఆధారంగా సాగు చేసిన వరి పొలాలు నెర్రెలు బారుతుండడంతో ప్రత్యామ్నాయాలపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

గండ్లు.. కడగండ్లు



చెన్నూరులో నెర్రెలు బారిన వరిపంట

- సాగర్ కాల్వ గండ్లకు పూర్తికాని మరమ్మతులు
- నీరందక నెర్రెలు బారుతున్న వరి పొలాలు
- ఇటీవల వరదలతో ప్రధాన కాల్వకు మూడు చోట్ల గండి
- పాలేరు పాత కాల్వ పనులు పూర్తవడంతో పాక్షికంగా నీటి విడుదల
- మరో వారం గడిస్తేనే పూర్తిస్థాయిలో పనులు, సాగునీరు

ఖమ్మంఅర్బన్/కొణిజర్ల/కల్లూరు రూరల్: కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన భారీ వర్షాలు, వరదతో జిల్లాలో సాగర్ ప్రధాన కాల్వకు పలు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. అయితే, గండ్ల తీవ్రత ఎక్కువగా ఉండడంతో రాత్రింబవళ్లు మరమ్మతులు చేస్తున్నా ఓ కొలిక్కి రావడం లేదు. ఫలితంగా సాగర్ డ్యాంలో ఈ ఏడాది పుష్కలంగా నీరు ఉండడంతో వానాకాలం పంటలకు ఢోకా లేదని ఆశించిన రైతులకు నిరాశ ఎదురవుతోంది. ఉప్పెనలా వచ్చిన వరదతో పడిన గండ్ల కారణంగా కాల్వల ద్వారా నీరు విడుదల చేయలేని పరిస్థితి ఉండడంతో రైతులు పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

వరదతో తలకిందులు

జిల్లాలో సాగర్ ఆయకట్టు 17 మండలాల పరిధిలో 2.54 లక్షల ఎకరాల మేర ఉంటుంది. గత ఏడాది నీరందక ఆయకట్టులో రైతులు పంటల సాగులో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కానీ ఈసారి సాగర్ డ్యాంలోకి పుష్కలంగా నీరు చేరడంతో దిగువకు విడుదల చేయగా పాలేరు రిజర్వాయర్ నిండు కుండలా మారింది. ఈ మేరకు ఆయకట్టు రైతులు సగం మేర వరిసాగు మొదలుపెట్టారు. ఇంతలోనే జిల్లాలో తుపాన్ కారణంగా పాలేరు రిజర్వాయర్‌కు భారీగా వరద చేరి అలుగు సైతం తట్టుకోలేకపోయింది. రాత్రికి రాత్రే 2లక్షల పైగా క్యూసెక్కుల నీరు రావడంతో సాగర్ ప్రధాన కాల్వతోపాటు పాలేరు పాత కాల్వకు సైతం పలుచోట్ల గండ్లు పడ్డాయి.



నీళ్లు లేక వెలవెలబోతున్న రాపల్లె మేజర్ కాల్వ

దెబ్బతిన్న కాల్వలు

పాలేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 23 అడుగులకు గాను ప్రస్తుతం 18 అడుగుల మేర నీరు ఉంది. అయినా సాగర్ జలాలు రావడానికి, విడుదల చేయడానికి వీల్లేనంతగా గండ్లు పడ్డాయని అధికారులు చెబుతున్నారు. పాలేరు రిజర్వాయర్‌కు సమీపాన ఇన్‌ఫ్లో ప్రాంతంలో కాల్వ వరద నీటి ప్రవాహానికి భారీగా కోతకు గురైంది. మరో చోట గండి పడడంతో మొత్తం మూడు చోట్ల సమస్య ఎదురవుతోంది. ఇక సమీపంలోనే యూటీ సైతం దెబ్బతిన్నట్లు ఆలస్యంగా గుర్తించిన అధికారులు మరమ్మతులపై దృష్టి సారించారు. ఇక సూర్యాపేట సమీపంలో కూడా గండి పడడంతో డ్యాం నుంచి పాలేరుకు నీటి విడుదల సాధ్యం కావడం లేదు. సాగర్ కాల్వలు నిర్మించాక మునుపెన్నడూ ఇలాంటి ఘటనలు ఎదురుకాలేదని చెబుతున్నారు. ఈమేరకు మరమ్మతులు పూర్తి చేయడానికి సుమారు రూ.20 కోట్లకు పైగానే వ్యయమవుతుందని జలవనరులశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

పంటను రక్షించుకునేందుకు అవస్థలు

నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, చింతకాని, కొణిజర్ల, ఏన్కూరు, బోనకల్లు, మధిర, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, ఎర్రుపాలెం తదితర మండలాల్లో సాగు చేసిన వరిని రక్షించుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టామని, పది రోజులు అధిక వర్షాలతో పైరు దెబ్బతినగా.. ఇప్పుడు నీరందక ఎండిపోతోందని ఆందోళన చెందుతున్నారు. పాలేరు పాత కాల్వ ద్వారా గురువారం పాక్షికంగా నీరు విడుదల చేసినా పొలాలకు చేరడానికి రెండు, మూడు రోజులు పడుతుంది.

భగీరథ ప్రయత్నాలు

వరి పంటను కాపాడుకునేందుకు పలువురు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. బావులు, బోర్ల సమీపాన ఉన్న వారు మోటార్లు అద్దెకు తీసుకొచ్చి పొలాలకు తడి అందిస్తున్నారు. అయితే, ఎకరం పొలం తడవడానికి ఆరు గంటలు మోటార్ నడపాల్సి వస్తోందని, ఇందుకు రూ.5వేల పైనే ఖర్చవుతోందని ఆవేదన చెందుతున్నారు. ఇంకొందరు కాల్వలో అడుగున ఉన్న నీటిని మోటార్ల ద్వారా పొలాలకు అందిస్తున్నారు.



లింగగూడెంలో బావి నుంచి పొలానికి నీరు పెడుతున్న రైతు

ఐదెకరాలు వడబడింది...



సాగర్ జలాలపై ఆశతో ఐదెకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు రూ.20 వేలు పైచిలుకు పెట్టుబడి అయింది. మరో పది రోజులు తడి అందితే చిరుపొట్ట దశకు చేరుతుండగా నీరు ఆగింది. మాకు నీరు అందడానికి సమయం పడుతుందంటున్నారు. దాదాపు రూ.లక్ష నష్టం వచ్చినట్టే.

– మరికంటి ఎల్లయ్య, రైతు, పెద్దమునగాల

చాలా ఖర్చు పెడుతున్నాం..



బోనకల్ బ్రాంచ్ కాల్వ కింద వరి సాగు చేశాం. పదిహేను రోజులుగా నీళ్లు రావడంలేదు. కాల్వలో నిల్వ ఉన్న కొద్దిపాటి నీటిని మోటార్లతో పారిస్తున్నా రూ.6వేలకు పైగాఖర్చవుతోంది. గత రెండేళ్లుగా నీళ్లు రాక వరిసాగు చేయలేదు. ఈ ఏడాది పర్వాలేదనుకుంటే ఇలా జరిగింది.

– తాళ్లూరి శ్రీనివాసరావు, రైతు, పెద్దకోరుకొండి

నాలుగైదు రోజుల్లో నీటి విడుదల

సాగర్ ప్రధాన కాల్వకు గండ్లు పడడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గండ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఆదివారం నాటికి ఆయకట్టుకు నీరు విడుదల చేసేలా కృషి జరుగుతోంది.

– విద్యాసాగర్, జలవనరుల శాఖ సీఈ

కేంద్ర మంత్రులను కలిసిన మంత్రి తుమ్మల



కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సత్కరించిన మంత్రి తుమ్మల, పక్కన అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాల పరిష్కారానికి చొరవ చూపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రులను కోరారు. ఈసందర్భంగా గురువారం ఆయన ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశమై కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పామాయిల్‌పై 28శాతం దిగుమతి సుంకం విధించి, దేశీయంగా ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహిస్తుండడంపై కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఆయిల్‌పామ్‌కు కేంద్రం కనీస మద్దతు ధర కల్పించాలని, ఇటీవల వరదలతో జరిగిన నష్టానికి గాను కేంద్రం నుంచి సాయం చేయాలని కోరారు. ఆతర్వాత కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిసి తెలంగాణలో ఎక్కువగా పండే పంటల ప్రాసెసింగ్‌కు యూనిట్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి రామ్మోహన్‌నాయుడును కలిసి రాష్ట్రంలోని కొత్తగూడెంతో పాటు పలు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లేఖ అందించారు. అలాగే, ఢిల్లీలో జరిగిన ప్రపంచ ఆహార సదస్సులో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఈక్రమంలోనే ప్రఖ్యాత కంపెనీల ఎండీలను తెలంగాణలో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆహ్వానించారు. ఆతర్వాత డెలాయిట్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన 'గ్రోత్ విత్ ఇంపాక్ట్ గవర్నమెంట్' సమ్మిట్‌లో పాల్గొని 'వికసిత్ తెలంగాణ' అంశంపై ప్రసంగించారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

సాఫీగానే సాగుతోందా?!

సింగరేణి మెడికల్ బోర్డుపై ఆగని ఆరోపణలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణపై విమర్శలు తగ్గడం లేదు. దళారులు, కొందరు అధికారుల సహకారంతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో మెడికల్ బోర్డు నిర్వహించగా మొదటి రోజైన గురువారం 194 మందిలో 166 మంది హాజరయ్యారు. వీరికి తొలి విడత పరీక్షలు పూర్తికాగా, శుక్రవారం నిపుణులతో పరీక్షలు చేయించి నిర్ధారిస్తారు. అయితే, ప్రతీ మెడికల్ బోర్డులో అక్రమాలు జరుగుతున్నాయనే ప్రచారం సాగుతోంది. ఈ ప్రక్రియలో గనుల్లోని ఉద్యోగులు మొదలు సింగరేణి భవన్, కార్పొరేట్ కార్యాలయం, ఆస్పత్రుల్లో కొందరి హస్తం ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే సీఎండీగా బలరామ్ బాధ్యతలు స్వీకరించాక విజిలెన్స్, ఏసీబీతో విచారణ చేయించారు. ఆ తర్వాత దళారుల గురించి వెల్లడిస్తే రూ.10వేల నజరానా ఇస్తామని ప్రకటించారు. కాగా, ఐదేళ్ల క్రితం ఓ వ్యక్తి వద్ద రూ.50 వేలు లభించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆస్పత్రి సిబ్బంది ఒకరు కంప్యూటర్ నుంచి జాబితా బయటకు చేరవేస్తున్నారని ప్రచారం జరిగినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యాన మెడికల్ బోర్డ్ నిర్వహణపై కార్మికుల్లో నమ్మకం సన్నగిల్లుతోందన్న చర్చ జరుగుతోంది.



సింగరేణి ప్రధానాస్పత్రికి హాజరైన కార్మికులు

3లక్షల లీటర్ల పాల ఉత్పత్తే లక్ష్యం

- ఆ దిశగా ఇందిరా డెయిరీ కార్యాచరణ
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో మూడు లక్షల లీటర్ల పాల ఉత్పత్తే లక్ష్యంగా ఇందిరా డెయిరీ కార్యాచరణ ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఇందిరా డెయిరీపై అధికారులతో సమీక్షించారు. ఇందిరా డెయిరీ నిర్వహణ విజయవంతమయ్యేలా పాల ఉత్పత్తి, సేకరణ, మార్కెటింగ్‌కు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వివిధ డెయిరీలకు పాలు సరఫరా చేస్తున్న వారితో పాటు గేదెల పెంపకంలో అవగాహన ఉన్న వారు, షెడ్డు, పశుగ్రాసం లభ్యత ఉన్న వారికి మరో యూనిట్ కేటాయించాలని తెలిపారు. మధిర నియోజకవర్గ పరిధిలో 8 నుంచి 10 పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడమే కాక 4వేల నుంచి 5 వేల లీటర్ల చిల్లింగ్ సామర్థ్యం కలిగిన యూనిట్‌కు భవనం సిద్ధంగా ఉన్నందున అవసరమైన వసతులు కల్పించాలని చెప్పారు. ఇందిరా డెయిరీలో వాటా కలిగిన 40 వేల మంది సభ్యులను విభజించి కార్పొరేషన్ల ద్వారా పాడి యూనిట్ల కొనుగోలుకు రుణాలు ఇప్పించాలని సూచించారు. ఈసమీక్షలో డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుమనోహర్, వివిధ సంక్షేమ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, జి.జ్యోతి, విజయలక్ష్మి, విజయ డెయిరీ డీడీ మురళీమోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్డీఓ సన్యాసయ్య



నాటుకోళ్ల ఫాం నిర్వహణపై ఆరా తీస్తున్న కలెక్టర్

రుణాలను సద్వినియోగం చేసుకోండి

కూసుమంచి: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేలా రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కూసుమంచి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జీవజ్యోతి మండల సమాఖ్య 18వ వార్షికోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు బ్యాంకు రుణాలతో అనుభవం ఉన్న వ్యాపారాలు చేస్తే ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందన్నారు. సమాజ అభివృద్ధికి సైతం సభ్యులు సహకరించాలని, బాల్య వివాహాలు, గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు, వినియోగంపై అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగ్గా హాజరుకాకపోతే ఎంఈఓలకు తెలియజేయాలన్నారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో జరిగిన పనులకు త్వరలోనే పూర్తి బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. తొలుత మండలంలోని జుజ్జులరావుపేటలో నాటుకోళ్ల ఫాంను పరిశీలించిన కలెక్టర్ గట్టుసింగారంలో మిల్క్‌డెయిరీని ప్రారంభించారు. నాటుకోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి ఫాం యజమాని రాణితో అవగాహన కల్పించాలని డీఆర్డీఓ సన్యాసయ్యను ఆదేశించారు. అదనపు డీఆర్డీఓ నూరోద్దీన్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'యూ డైస్'లో పక్కాగా సమాచారం

- ప్రతీనెల మూడో శనివారం పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్
- విద్యాశాఖపై సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: పాఠశాలలు, విద్యార్థుల సమాచారాన్ని పూర్తిస్థాయిలో యూ డైస్ పోర్టల్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ అన్నిస్థాయిల ప్రభుత్వ పాఠశాలల సమాచారం నమోదు చేయడమే కాక ప్రైవేట్ పాఠశాలల సమాచారాన్ని సైతం సేకరించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లకు లైసెన్స్ ఉందా, లేదా అని ఆరా తీసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని, ప్రతీనెల మూడో శనివారం పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని తెలిపారు. అంతేకాక కేజీబీవీలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ పాఠశాలల విద్యార్థులు పోటీ పరీక్షల్లోసత్తా చాటేలా శిక్షణ ఇవ్వాలని ఆమె సూచించారు. ఈసమావేశంలో డీఈఓ సోమశేఖరశర్మ, సంక్షేమ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, విజయలక్ష్మి, జి.జ్యోతి, ఆర్ఎంఓ రాజశేఖర్, ఏఎంఓ రవి, ప్రోగ్రాం అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

లక్ష్యాలను చేరుకోవాలి..

ఆరోగ్య కార్యక్రమాల అమలులో లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. వైద్య, ఆరోగ్యశాఖపై జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రతీ సోమవారం మండలంలో సమావేశాలు నిర్వహించి శాఖాపరమైన సమస్యలు చర్చించి పరిష్కరించాలన్నారు. పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం అందించడమేకాక వ్యాక్సినేషన్ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అలాగే, మాతాశిశు సంక్షేమం, జాతీయ కీటక జనిత వ్యాధులు, లెప్రసీ, హెచ్ఐవీ కార్యక్రమాల నిర్వహణపై సూచనలు చేశారు. డీఎంహెచ్ఓ వి.సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు సైదులు, సీతారాం, ప్రోగ్రాం అధికారులు చందునాయక్, వెంకటరమణ, రామారావు, శేషపద్మ, జి.సాంబశివరెడ్డి, దుర్గ పాల్గొన్నారు.

హైవేపై మరింత ఎత్తుకు హైటెన్షన్ వైర్లు

పనులు పూర్తయ్యే వరకు వాహనాల దారి మళ్లింపు

నేలకొండపల్లి: కోదాడ – ఖమ్మం జాతీయ రహదారి పనులు చివరి దశకు చేరడంతో మార్గమధ్యలోని హైటెన్షన్ విద్యుత్ తీగల ఎత్తు పెంపునకు ప్రణాళిక రూపొందించారు. హైవే మధ్యలో నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం సమీపాన వంతెనపై విద్యుత్ తీగలు కిందకు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. దీంతో రహదారిని ప్రారంభించకముందే వీటిని సరిచేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా తీగలను మరో ఐదు అడుగుల ఎత్తులో ఏర్పాటుచేస్తారు. ఈమేరకు గువ్వలగూడెం మోర్లబండ వాగు వద్ద రహదారులను మళ్లించనున్నారు. ఈక్రమంలో వాహనాలు సర్వీస్ రోడ్డు వైపు వెళ్లేలా రెండు పక్కలా ప్రత్యేకంగా ఎగ్జిట్, ఎంట్రీ ఏర్పాటు చేస్తున్నారు. కేవలం ఇరవై రోజుల పాటే ఇవి అందుబాటులో ఉన్నాయని వెల్లడించిన అధికారులు గురువారం మార్కింగ్ చేశారు.



దారి మళ్లింపు కోసం తవ్విన రహదారి

దరఖాస్తుల పరిశీలన షురూ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు జనాన్ని అతలాకుతలం చేశాయి. జిల్లా కేంద్రంతో పాటు పలువురి ఇళ్లలోకి వరద చేరడంతో విద్యార్హతల సర్టిఫికెట్లు పాడయ్యాయి. దీంతో తిరిగి అందించేందుకు గాను అధికారులు బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 370మంది పదో తరగతి మెమోలు పోయినట్లు దరఖాస్తు చేసుకున్నారని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. డీఈఓ కార్యాలయంలో గురువారం నుంచి దరఖాస్తుల పరిశీలన మొదలుపెట్టగా, సందేహాలు ఉన్న వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నట్లు డీఈఓ వెల్లడించారు.

క్లుప్తంగా

వరద బాధితుల కోసం రూ.2.25లక్షలు



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల వరదలతో సర్వం కోల్పోయిన వారిని ఆదుకునేందుకు పలువురు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షాన విరాళాలు అందజేశారు. ఈ మొత్తం రూ.2.25లక్షలకు చేరాయి. దీంతో మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు చెక్కు అందజేశారు.

మార్కెట్‌లోకి మహేంద్రా 'వీరో'



వీరో వాహనాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: మహేంద్రా అండ్ మహేంద్రా ఆటోమొబైల్ కంపెనీ వాణిజ్య విభాగంలో కొత్తగా రూపొందించిన వీరో వాహనాన్ని ఖమ్మంలోని షోరూంలో గురువారం విడుదల చేశారు. ఈసందర్భంగా వీవీసీ గ్రూప్స్ ఎండీ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ వర్చువల్‌గా మాట్లాడుతూ మహేంద్రా కంపెనీ వాణిజ్య వాహనం వీరోను దేశంలోనే తొలిసారి డీజిల్‌తో పాటు సీఎన్‌జీ విభాగాల్లో విడుదల చేసిందన్నారు. అంతేకాక డ్రైవర్‌కు ఎయిర్‌బ్యాగ్, పవర్ విండోస్ తదితర అధునాతన సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. వీవీసీ మోటార్స్ ఉద్యోగులు, వాహనాల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

స్కూల్ గ్రాంట్ నిధులు విడుదల

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ నిధులు విడుదలయ్యాయి. ఈమేరకు జిల్లాలోని 1,207 పాఠశాలలకు గాను రూ.1,52,17,500 విడుదలయ్యాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ నిధులు ఒకటి, రెండు రోజుల్లో పాఠశాలల ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు.

21న కేజీబీవీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి గతేడాది జూలైలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 21న పరిశీలించనున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, నర్సింగ్, పీఈటీలను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించేందుకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల వివరాలను తమ కార్యాలయం వద్ద విడుదల చేశామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్‌తో పాత డీఈఓ కార్యాలయంలో ఈనెల 21న ఉదయం 10గంటలకు హాజరుకావాలని సూచించారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వైరా: ఉపాధ్యాయుల, విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా తమ సంఘం పనిచేస్తోందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. వైరాలో గురువారం నిర్వహించిన పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా జీఓల సాధన, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలలో కీలకపాత్ర పోషించామని తెలిపారు. త్వరలోనే పెండింగ్ డీఏ, పీఆర్సీ బిల్లులు సాధిస్తామని వెల్లడించారు. కాగా, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపట్టిన ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ఆర్.రంగారావు, వి.విజయ్, అమృత్ కుమార్, ఆర్.బ్రహ్మారెడ్డి, జి.సుజాత, డి.వెంకటేశ్వరరావు, డి.సత్యనారాయణ, కె.దయాకర్, వి.నర్సింహారావు, పి.రామచంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,300	4,000
పెసలు (మార్క్‌ఫెడ్)	8,682	8,682
వేరుశనగ	4,900	4,900
మిర్చి	17,500	8,500
ఏసీ మిర్చి	20,000	10,000
ఏసీ తాలు	10,000	8,000
కొత్త పత్తి	7,722	7,300
పాత పత్తి	7,900	7,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

పాలేరు పాత కాల్వ ద్వారా నీటి విడుదల

- దశల వారీగా పెంచుతామన్న అధికారులు
- 23 గ్రామాల పరిధి ఆయకట్టుకు నీరు



పాలేరు పాత కాల్వకు నీరు విడుదల చేసిన దృశ్యం

కూసుమంచి/ఖమ్మం అర్బన్: ఇటీవల వరదలతో పాలేరు రిజర్వాయర్‌కు పాత కాల్వకు గండ్లు పడగా యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేయించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతర పర్యవేక్షణలో గురువారం పనులు ఓ కొలిక్కి రాగా గురువారం నీరు విడుదల చేశారు. ఈనేపథ్యాన 25వేల ఎకరాల ఆయకట్టు నీరు అందనుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

100పైగా క్యూసెక్కులు

కాల్వకు ఒక చోట 70 మీటర్లు, మరో చోట 50 మీటర్ల మేర గండ్లు పడిన విషయం విదితమే. వీటి మరమ్మతులు పూర్తయిన నేపథ్యాన గురువారం 100 నుండి150 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ కాల్వ ద్వారా నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో 23 గ్రామాల పరిధి ఆయకట్టుకు నీరు అందుతుంది. అయితే, కాల్వ డిజైన్ ఆధారంగా 320 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేసే అవకాశమున్నా దశల వారీగా పెంచుతామని అధికారులు చెబుతున్నారు. గురువారం కాల్వ వద్ద నీటి విడుదలను జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగరావు, పాలేరు ఈఈ మంగళపుడి వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

మంత్రి ఉత్తమ్ దృష్టికి...

ఖమ్మంవన్‌టౌన్: సాగర్ ఎడమ కాల్వకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చేలా చర్యలు తీసుకోవాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. పనులు నత్తనడకన సాగుతున్నందున త్వరగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జాకు పనులపై సూచనలు చేశారు.

సాగర్ కాల్వ గండ్లు వెంటనే పూడ్చాలి..

కొణిజర్ల/చింతకాని/మధిర: సాగర్ కాల్వకు పడిన గండ్లు పూడ్చివేత పనుల్లో వేగం పెంచి నీరు విడుదల చేయాలని, తద్వారా పంటలు ఎండిపోకుండా కాపాడాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్‌చేశారు. కొణిజర్ల మండలంతో పాటు చింతకాని మండలం నేరడ, ప్రొద్దుటూరు గ్రామాల్లో ఎండిపోతున్న పంటలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గండ్లు పడి రెండు వారాలు గడుస్తున్నా మరమ్మతులు పూర్తిచేయలేకపోవడం గర్హనీయమన్నారు. ఇకనైనా పనుల్లో వేగం పెంచి నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టరేట్, నీటి పారుదల శాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఇక మధిరలో జరిగిన సీపీఐ నాయకుడు మంగళగిరి రామాంజనం సతీమణి లీలావతి సంస్మరణ సభతో పాటు చింతకాని మండలం కోమట్లగూడెంలో పార్టీ నాయకుడు అవులూరి బక్కిరెడ్డి సంస్మరణ సభలో కూడా హేమంతరావు మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, తోట రామాంజనేయులు, మోహనరావు, మందడపు రాణి, బెజవాడ రవిబాబు, ఊట్ల కొండలరావు, చావా మురళి, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ డీడీకి అదనంగా 'మైనార్టీ' బాధ్యతలు



జలగం నగర్ పాఠశాలలో పరిశీలిస్తున్న సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణను ఇన్‌చార్జ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా నియమించారు. ప్రస్తుతం మైనారిటీ సంక్షేమశాఖ అధికారిగా ఉన్న ఎం.ఏ.మహమూదీ మాతృశాఖ అయిన పంచాయతీరాజ్‌కు వెళ్లారు. దీంతో ఎస్సీ డీడీ సత్యనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించడమే కాక ఉద్యోగులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆతర్వాత మున్నేరు వరదతో మునిగిన జలగంనగర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించి, త్వరగా మరమ్మతు పూర్తిచేయాలని ఆదేశించారు.

మీ అమ్మాయి డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయింది!

సీబీఐ అధికారిని అంటూ తప్పుడు ఫోన్

నేలకొండపల్లి: 'నేను సీబీఐ అధికారిని.. మీ అమ్మాయిని డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేశాం...' అంటూ ఓ వ్యక్తి వాట్సాప్ ద్వారా కాల్ చేయగా ఫోన్ అందుకున్న వ్యక్తి పక్కనే కుమార్తె ఉండడంతో అప్రమత్తమై సైబర్ నేరం బారిన పడకుండా కాపాడుకున్న వైనమిది. నేలకొండపల్లి మండలానికి చెందిన ఓ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి బుధవారం వాట్సాప్ కాల్ వచ్చింది. సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్న అవతలి వ్యక్తి.. ఉద్యోగి కుమార్తె బ్యాగ్‌లో డ్రగ్స్ దొరకగా అరెస్ట్ చేశామని చెప్పాడు. అయితే, ఆ సమయాన కుమార్తె తన పక్కనే ఉండడం, సైబర్ నేరగాళ్లు ఇలా చేస్తున్నారని అవగాహన ఉండడంతో వెంటనే ఫోన్ స్విచాఫ్ చేశాడు. అంతేకాక తన బంధువులకు చెప్పడంతో ఫోన్ హ్యాక్ అయిందనే అనుమానం వ్యక్తం చేయడంతో బ్యాంక్ ఖాతాలోని రూ.76 వేలను మరో ఖాతాకు మళ్లించాడు. కొందరు ఇలాగే ఫోన్ హ్యాక్ చేసి భయపెడుతూ మాట్లాడుతుండగానే ఖాతాలోని డబ్బు స్వాహా చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై కాస్త అవగాహన ఉండడంతో సదరు ఉద్యోగి చాకచక్యంగా బయటపడ్డాడు.

అటవీ సంపదను పరిరక్షించాలి

సీసీఎఫ్ భీమానాయక్



టేకు ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్

చర్ల: అటవీ సంపద సంరక్షణకు సిబ్బంది చర్యలు చేపట్టాలని సీసీఎఫ్ భీమానాయక్ సూచించారు. గురువారం ఆయన చర్ల, దుమ్ముగూడెం రేంజ్‌లలో పర్యటించారు. ఆర్.కొత్తగూడెం బీట్‌లోని దేవరాపల్లి అటవీ ప్రాంతంలో ట్రెంచ్ కటింగ్ పనులను, ఆ తర్వాత సుబ్బంపేటలో టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం ఏయే ప్రాంతాల్లో ఎంతమందికి హక్కుపత్రాలు ఉన్నాయి, వారు ఎంత భూమి సాగు చేస్తున్నారు అనే అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ కిష్టాగౌడ్ ఎఫ్‌డీఓ సుజాత, ఎఫ్ఆర్‌ఓలు ద్వాలియా, కమల తదితరులు పాల్గొన్నారు.

దిగబడిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం



దిగబడిన లారీని ముందుకు నెడుతున్న పొక్లెయినర్

చింతకాని: మండలంలోని నాగులవంచ వద్ద ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై గురువారం లారీ దిగబడడంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. నాగులవంచ బండిరేవు వాగుపై బ్రిడ్జి నిర్మిస్తుండడంతో అప్రోచ్ రోడ్డు వేశారు. ఇటీవల వర్షాలకు రహదారి కొట్టుకుపోగా మట్టి పోసి చదును చేశారు. ఈక్రమంలో ఖమ్మం వైపు నుంచి బోనకల్ వైపు రైల్వే స్లీపర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ దిగబడగా రెండు వైపులా వాహనాలు వెళ్లే మార్గం లేక నిలిచిపోయాయి. చివరకు పొక్లెయినర్, రెండు జేసీబీల సాయంతో లారీని బయటకు తీసుకురాగా రెండు గంటల అనంతరం రాకపోకలు మొదలయ్యాయి. ఈ సమయంలో ప్రయాణికులు, కళాశాల విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

ఆమే ఒక సైన్యంగా...

- ఆలయంలో అక్రమాలపై ప్రక్షాళన
- భద్రాద్రి దేవస్థానం భూముల పరిరక్షణకు పోరాటం
- రామాలయ పేటెంట్ హక్కుల కోసం ప్రణాళికలు
- భక్తుల మెప్పు పొందుతున్న ఈఓ రమాదేవి



కర్నూలు జిల్లాలో స్వాధీనం చేసుకుని కౌలుకు ఇచ్చిన భూమిలో ఈఓ, ఇతర అధికారులు (ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధునికత వైపు పరుగులు పెడుతోంది. ఆలయంలో అవినీతి, అక్రమాలపై ప్రక్షాళన పరంపర కొనసాగుతోంది. ఆలయ ఈఓ రమాదేవి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చేపడుతున్న ప్రణాళికలతో భక్తుల రాకతో పాటు హుండీ ఆదాయం సైతం పెరిగాయి. ఆలయ భూముల పరిరక్షణలోనూ తనదైన మార్కు చూపెడుతున్నారు. అటు అక్రమ నిర్మాణదారులకు, నిబంధనలను పాటించని అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. విధి నిర్వహణలో ఇవన్నీ భాగమే అయినా తనదైన శైలిలో ముందుకు సాగుతూ ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుండడంతో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

రామయ్య భూముల విషయంలో..

నిక్కచ్చిగా ఉన్న ఈఓను రాజకీయ ప్రాబల్యంతో బెదిరించినా, బదిలీ చేయిస్తామన్నా ఆమె భయపడలేదు. లడ్డూ తయారీ కేంద్రంలో కాంట్రాక్టర్ అక్రమాలపై దృష్టి పెట్టడంతో అతడు రాత్రికి రాత్రే వంట సామగ్రి, సిబ్బందితో సహా వెళ్లిపోయాడు. అయితే భక్తులకు లడ్డూల కొరత రాకుండా తెల్లవారుజాము వరకు ఆలయంలోనే ఉండి కొందరు సిబ్బంది, అర్చకులతో తయారు చేయించారు. టెండర్ ధర విషయంలోనూ పట్టు నిలుపుకున్నారు. ఇక ఏపీలోని పురుషోత్తపట్నంలో గల రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి పోరాడడంలో ఒంటరిగా ధైర్యం చూపారు. పలుమార్లు ఏపీ మంత్రులు, కలెక్టర్, పోలీస్ అధికారులను కలిసి సమస్యను వివరించడంతో పాటు కోర్టుకు వెళ్లి ఆలయానికి అనుకూలంగా ఉత్తర్వులు పొందారు. అయినా అక్రమ నిర్మాణాలు ఆగకపోవడంతో అర్ధరాత్రి వరకు ధర్నాకు సైతం దిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత ఎన్నికల ముందు ఆమెను కీసర ఆర్‌డీఓగా బదిలీ చేసినా భక్తులు, పలువురు పెద్దలు రమాదేవిని ఇక్కడే ఈఓగా కొనసాగించాలని కోరడంతో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సైతం ఆమెకు మద్దతు తెలపడంతో బదిలీ రద్దు చేశారు.

ఆలయానికి పేటెంట్ హక్కుల కోసం..

పలు ధార్మిక సంస్థలు ఆధ్యాత్మికత, భద్రాచలం రామయ్య పేరుతో విరాళాలు సేకరిస్తూ ప్రైవేట్ కార్యక్రమాలు నిర్వహించడాన్ని ఈఓ తీవ్రంగా పరిగణించారు. వారి వ్యవహార శైలిని ఖండించారు. అంతేకాక రామాలయానికి పేటెంట్ హక్కులు పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే రామాలయంలో జరిగే పూజా వివరాలు, కాటేజీలు, గదులను ఆన్‌లైన్‌లో పొందుపర్చి దూర ప్రాంత భక్తుల ఇబ్బందులు తొలగించారు. నిత్యాన్నదానం, ఇతర విభాగాలలో పూర్తి స్థాయి ఆన్‌లైన్ వ్యవస్థతో పాటు సిబ్బందికి కంప్యూటర్‌పై శిక్షణ, బార్‌కోడ్ రూపకల్పనతో పారదర్శకతకు రంగం సిద్ధం చేశారు. ఇక తాజాగా పలు కేసుల్లో, అంశాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవస్థానం ప్రధాన అర్చకుడికే షోకాజ్ నోటీసులు జారీ చేసి సంచలనం సృష్టించగా.. ఆయనను దేవాదాయ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఎంతటి వారు తప్పు చేసినా సహించేది లేదన్నట్టుగా నిజాయితీతో వ్యవహరిస్తున్న ఈఓ రమాదేవి తీరును భక్తులు మెచ్చుకుంటున్నారు.

కఠిన నిర్ణయాలతో..

గత ఏడాది శ్రీరామనవమి ఉత్సవాలకు కొద్ది రోజుల ముందు ఇక్కడి ఈఓ శివాజీ బదిలీ కావడంతో హైదరాబాద్ దేవాదాయ శాఖలో ల్యాండ్ టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తున్న రమాదేవి 2023 ఫిబ్రవరి 16న రామాలయ ఈఓగా ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు. సమయం తక్కువగానే ఉన్నా శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. ఆలయంలో లడ్డూ, టికెట్ కౌంటర్లు, సీఆర్‌ఓ విభాగాల సిబ్బంది పలువురు చేతివాటం చూపిస్తూ లక్షల రూపాయల రామయ్య సొమ్మును కాజేస్తూ ఖజానాకు కన్నం పెట్టారు. దీన్ని అదుపులో పెట్టేందుకు కఠినమైన నిర్ణయాలు తీసుకున్న ఈఓ వారి ఆట కట్టించారు. కాజేసిన సొమ్మును పెనాల్టీతో కట్టించగా, మరి కొందరిని సస్పెండ్ చేశారు. సిబ్బంది ఒకే విభాగంలో పాతుకుపోకుండా మూడు నెలలకోసారి అంతర్గత బదిలీలు చేస్తున్నారు. ఇలాంటి మార్పులతో రామాలయ హుండీ ఆదాయం గణనీయంగా పెరిగింది. నెలకే రూ.కోటికి పైగా వస్తుండడం విశేషంగా చెప్పుకుంటున్నారు.

కేఎంసీ సీనియర్ అసిస్టెంట్‌గా సుధాకర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్‌గా సుధాకర్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గత నెలలోనే మహబూబాబాద్ మున్సిపాలిటీ నుంచి సుధాకర్‌ను కేఎంసీకి, ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న రమేష్‌ను వరంగల్‌కు కేటాయించారు. అయితే, ఉత్తర్వులను నిలిపేయడంతో బాధ్యతలు స్వీకరించలేదు. మరోమారు సుధాకర్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో గురువారం ఆయన విధుల్లో చేరారు. దీంతో రమేష్‌ను రిలీవ్ చేసి వరంగల్ కార్పొరేషన్‌కు పంపించనున్నారు. అయితే, ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు ఇస్తున్నా ఇక్కడి అధికారులు కొందరు అడ్డుకుంటున్నారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఎదుళ్ల చెరువు సర్వే ప్రారంభం



వరి పైరు మధ్యలో కొలతలు వేస్తున్న అధికారులు

తల్లాడ: తల్లాడకు ఆనుకొని ఉన్న ఎదుళ్ల చెరువు సర్వే గురువారం ప్రారంభమైంది. చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందని, ఆ స్థలంలో కొందరు నిర్మాణాలు చేపట్టాలని ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సర్వే మొదలుపెట్టారు. ఎదుళ్ల చెరువు 757 సర్వే నంబర్‌లో 113 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. చెరువు 140 ఎకరాలు సాగవుతోంది. వరంగల్-దేవరపల్లి జాతీయ రహదారి పక్కన బస్టాండ్‌ను ఆనుకుని చెరువు శిఖం ఉండడంతో ధర రూ.కోట్లలోకి చేరడంతో పలువురు ఆక్రయించుకుంటున్నారని ఇరవై ఏళ్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ స్థలంలో ఇన్నాళ్లు నిర్మాణాలుజరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోగా చివరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ధర్మారావు ఆధ్వర్యాన జల వనరులు, రెవెన్యూ శాఖల అధికారులు కొలతలు మొదలుపెట్టారు. ఇటీవల వర్షాలతో చెరువు నిండా నీరు చేరడంతో అక్కడక్కడా ఆటంకాలు ఎదురుకాగా, నీరు తగ్గాక సర్వే మళ్లీ చేస్తామని ప్రకటించారు. కాగా, సర్వే మొదలవడంతో శిఖం భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారిలో ఆందోళన మొదలైంది. తల్లాడ జలవనరుల శాఖ డీఈఈ శ్రీనువాసరావు, ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ భాస్కర్, సర్వేయర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

వైరారూరల్: పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వైరా పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని తాటిపూడి-సోమవరం మధ్య మామిడి తోటలో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వైరా ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకోవడమేకాక కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాళ్లగూడెంలో దొంగల హల్‌చల్

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెంలో గురువారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామానికి చెందిన చిర్రా మంగమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలకు చొరబడినా విలువైన వస్తువులు లభించక సామగ్రిని చిందరవందరగా పడేసి వెళ్లిపోయారు. ఆతర్వాత గ్రామశివారు శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో హుండీని పగులగొట్టారు. అందులో కూడా పెద్దగా నగదు లభించలేదని తెలుస్తోంది. ఆలయంలో ఓ వ్యక్తి కోట కత్తితో ఉన్న దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. రెండు ఘటనల్లోనూ విలువైన వస్తువులేమీ చోరీ కాకున్నా దొంగలు తిరుగుతున్నారనే ప్రచారంలో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పెయింటర్ ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రామన్నపేటకు చెందిన పెయింటర్ తూరగంటి రాజు(37) గురువారం తన ఇంటి ఎదుట చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివాహం కావడం లేదనే మనస్థాపంతో ఆయన మద్యానికి అలవాటు పడ్డాడు. బుధవారం రాత్రి కూడా మద్యం తాగొచ్చిన రాజు, గురువారం ఉదయం ఎవరూ లేని సమయాన ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఆయన తల్లి వెంకటమ్మ ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి యువకుడు...



రఘువర్మ (ఫైల్)

మధిర: మధిర - తాండ్ర గోపవరం రైల్వేస్టేషన్ల మధ్య దెందుకూరు సమీపాన గురువారం ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం పుట్లగూడెంకు చెందిన శెట్టి రఘువర్మ(22) తన అమ్మమ్మ, తాతయ్య వద్ద రాయపట్నంలో ఉండి చదువుకుంటున్నాడు. ఆయన వ్యక్తిగత కారణాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఘటనపై ఖమ్మం జీఆర్‌పీ ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

తల్లాడ: మండలంలోని వెంకటగిరి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మండలం కొత్త మిట్టపల్లి కి చెందిన లారీ డ్రైవర్ బిల్లా రాజేష్(30) బుధవారం రాత్రి తన భార్యతో బైక్‌పై తల్లాడకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో వెంకటగిరి క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య రేవతిదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

15 అడుగుల కొండచిలువ హతం



హతమైన కొండచిలువ

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో భారీ కొండ చిలువను రైతులు హతం చేశారు. మోటాపురంలో రైతు భూక్యా వెంకట్రాములు గురువారం పత్తి పొలంలో పని చేస్తుండగా కొండచిలువ కనిపించింది. దీంతో ఆయన కేకలు వేయగా చుట్టుపక్కల రైతుల చేరుకుని చంపేశారు. దాదాపు 15 అడుగులు పొడవు, 40 కేజీల బరుతో కొండ చిలువ ఉందని వారు వెల్లడించారు.

క్లుప్తంగా...

స్పిన్నర్ల, నేత కార్మికుల వేతనాల పెంపు

- కేంద్ర ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని స్పిన్నర్లకు 25 శాతం, నేత కార్మికులకు 7 శాతం వేతనాలు పెరుగుతున్నట్లు కేంద్ర ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ చైర్మన్ మనోజ్ కుమార్ వెల్లడించారు. మహాత్మాగాంధీ జయంతి అక్టోబర్ 2 నుంచి పెరిగిన వేతనాలు అమలులోకి వస్తాయని ప్రకటించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖాదీ కార్మికులకు వరాలు ప్రకటించారు. న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఎంఈజీపీ 1,100 కొత్త యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 3,911 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.101 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీని అందించినట్లు చెప్పారు. కొత్త యూనిట్ల ప్రారంభంతో 43,021 మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. పీఎంఈజీపీ ద్వారా గత పదేళ్లలో 9.58 లక్షల కొత్త ప్రాజెక్టులతో 83.48 లక్షల మందికి ఉపాధి లభించిందని చెప్పారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 10.17 లక్షల కొత్త ఉద్యోగాలను కల్పించినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 3 వేల ఖాదీ సంస్థల ద్వారా 4.98 లక్షల మంది ఖాదీ కళాకారులు ఉపాధి పొందుతున్నారని, వీరిలో 80 శాతం మంది మహిళలన్నారు. ఖాదీ ద్వారా గ్రామీణ భారతదేశం ఆర్థికంగా సాధికారత సాధిస్తుందనడానికి ఇదే ప్రతీక అని అన్నారు.

'నెస్ట్స్' స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా శరత్

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి జాతీయ కమిటీలో చోటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ శరత్‌కు కేంద్ర ప్రభుత్వ కమిటీలో చోటు దక్కింది. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (నెస్ట్స్)లో శరత్‌ను స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిపాటు ఆయన కమిటీలో కొనసాగనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ గిరిజన ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోంది. వీటి నిర్వహణ, పర్యవేక్షణతోపాటు కేంద్ర ప్రభుత్వానికి సలహాలు అందించడంపై స్టీరింగ్ కమిటీ కీలకం కానుంది. శరత్‌ను దేశంలోని అన్ని రాష్ట్రాల తరఫున కమిటీ సభ్యుడిగా కేంద్రం నామినేట్ చేసింది. ఈ సందర్భంగా గిరిజన, ఏకలవ్య మోడల్ పాఠశాలల, గిరిజన గురుకుల సిబ్బంది శరత్‌ను అభినందించారు.

రేషన్ కార్డులకు సన్న బియ్యం ఎలా?

జనవరి నుంచే రేషన్ షాపులకు సన్నబియ్యం అని ప్రకటించిన ప్రభుత్వం



- ప్రస్తుతం సర్కార్ గోడౌన్‌లలో సన్న బియ్యం నిల్వలు స్వల్పమే
- పౌరసరఫరాల శాఖ సేకరిస్తున్న ధాన్యంలో 95 శాతం దొడ్డు వడ్లే
- ఈ ఖరీఫ్‌లో సన్న ధాన్యం మార్కెట్‌కు వస్తుందని సర్కార్ భావన
- రూ.500 బోనస్ ప్రకటనతో పంట పెరుగుతుందని అంచనా

సాక్షి, హైదరాబాద్: రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లలో సన్నబియ్యం నిల్వలు 50 వేల మెట్రిక్ టన్నులు కూడా లేవని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీకి అవసరమయ్యే సన్న బియ్యాన్ని ఎలా సేకరించాలనే విషయమై సంస్థ తర్జనభర్జన పడుతోంది. ఖరీఫ్ పంట అక్టోబర్ నుంచి మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఎంత మేరకు ధాన్యం వస్తుందనే విషయంలో స్పష్టత లేదు. వచ్చిన సన్నాలను మరాడించి సన్న బియ్యంగా జనవరి నుంచి రేషన్ దుకాణాలకు పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

24 ఎల్‌ఎంటీల బియ్యం అవసరం

రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో రేషన్‌కార్డులు 89.96 లక్షలున్నాయి. ఈ కార్డుల లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు నెలకు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బియ్యం అవసరం. అంటే ఏడాదికి 21.60 ఎల్ఎంటీల సన్నబియ్యం కావాలి. ఇవికాకుండా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంక్షేమ హాస్టళ్లకు, మధ్యాహ్న భోజన పథకానికి కలిపి ఏటా 2.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలి. అంటే ఏటా సన్నబియ్యం 24 ఎల్ఎంటీలు అవసరమవుతుంది. ఇందుకోసం 36 ఎల్ఎంటీల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. విద్యార్థులకు గత ప్రభుత్వ హయాం నుంచే సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నారు. ఈ ఏడాది సన్నబియ్యం కొరత ఏర్పడటంతో గత మే నెలలో 2.2 ఎల్ఎంటీ సన్న బియ్యం కొనుగోలు కోసం టెండర్లను ఆహ్వానించిన ప్రభుత్వం తరువాత వెనకడుగు వేసింది.

ఖరీఫ్‌లో వచ్చే సన్న ధాన్యం 5 ఎల్ఎంటీ లోపే..

రాష్ట్రంలో సగటున ఏటా కోటిన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ సేకరిస్తుంది. ఇందులో ఖరీఫ్‌లో మాత్రమే రైతులు సన్నాలను పండిస్తున్నారు. ఈ సీజన్‌లో పౌరసరఫరాల శాఖ 50 నుంచి 60 ఎల్ఎంటీల ధాన్యం మాత్రమే సేకరించగలుగుతోంది. ఇందులో 5 ఎల్ఎంటీలే సన్నాలు ఉంటున్నాయి. రైతులు ఈ సీజన్‌లో సన్నాలను పండించినప్పటికీ, తమ అవసరాలకు నిల్వ చేసుకుంటుండటంతో మార్కెట్‌కు రావట్లేదు. నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, నారాయణపేట జిల్లాల్లో పండే మేలు రకం సన్న ధాన్యం నేరుగా మిల్లులకు వెళ్లడం లేదంటే బియ్యంగా మార్చి విక్రయించడం జరుగుతోంది. రబీలో వచ్చే మరో 70 ఎల్ఎంటీల ధాన్యంలో సన్నాలు నిల్. రాష్ట్ర వాతావరణం రీత్యా రబీలో సన్న ధాన్యం పండిస్తే, నూకల శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది దీర్ఘకాల పంట పంట కావడంతో రైతులు దొడ్డు ధాన్యాన్నే పండిస్తున్నారు.

ఈ ఖరీఫ్ సీజన్‌పై సర్కార్ ఆశ

రూ.500 బోనస్ ప్రకటనతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సన్నాలను రైతులు అధికంగా పండించినట్లు ప్రభుత్వం భావిస్తోంది. ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320 ఉండగా, ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తే ఆ మొత్తం రూ. 2,820 అవుతుంది. కాగా 30 రకాలను రూ. 500 బోనస్ ఇచ్చే ఫైన్ వెరైటీలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫైన్ వెరైటీల్లో అధిక డిమాండ్ ఉన్న హెచ్‌ఎంటీ, సోనా మసూరి, జైశ్రీరాం వంటి రకాలు అధిక ధరలకు అమ్ముడుపోయినా, మిగతా వెరైటీలకు డిమాండ్ లేకపోవడంతో అవి మార్కెట్‌కు వస్తాయని భావిస్తోంది. అక్టోబర్ చివరి నుంచి ధాన్యం సేకరణ చేపట్టి, సన్నాలను వెంట వెంటనే మిల్లింగ్ చేస్తే జనవరి నాటికి రేషన్ దుకాణాలకు పంపవచ్చని ఓ అధికారి చెప్పారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- 20 నుంచి 45 నిమిషాల్లో వైద్యచికిత్స అందేలా కార్యాచరణ
- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందేలా ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు
- నర్సంపేటలో జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, వరంగల్/నర్సంపేట: ఏ ప్రభుత్వానికైనా మొదటి ప్రాధాన్యంగా విద్య, వైద్యం ఉండాలి.. అవి అమలు చేసేదిశగా మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ.183 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య కళాశాలను గురువారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4 వేల మెడికల్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలు భర్తీ చేశామని వెల్లడించారు. 7 వేల మందికి నర్సింగ్ పోస్టింగ్‌లు ఇచ్చామని, త్వరలో ఇంకో 2,500 మందికి పోస్టింగ్ ఇచ్చే దిశగా నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 'సామాన్యులకు ఎక్కడి నుంచైనా 20 నుంచి 45 నిమిషాల్లో వైద్యచికిత్స అందేవిధంగా ప్రాథమిక, ఏరియా, జిల్లా ఆస్పత్రులను నిర్మించే ఏర్పాట్లు చేస్తున్నాం. సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులోకి వచ్చే విధంగా 108, 104, 102 ఆరోగ్యశ్రీ ట్రస్టు లాంటివి కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. 2004 నుంచి ఇప్పటివరకు ట్రీట్‌మెంట్ ప్రొసీజర్ చార్జెస్ గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పెంచలేదు. కానీ మా ప్రభుత్వం ఏర్పాటు కాగానే 40 శాతం పెంచింది. దానికోసం రూ.4,000 కోట్లు అదనంగా ఖర్చు చేశాం'అని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన గంట (గోల్డెన్ అవర్)లోపు వైద్యం అందించే విధంగా తెలంగాణవ్యాప్తంగా ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న మిషన్ భగీరథలో భారీ అవినీతి జరిగిందని, రూ.46వేల కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్లు పక్కదారి పట్టాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథపై సర్వే నిర్వహించగా, 53 శాతం ఇళ్లకు మంచి నీరు అందడం లేదనే భయంకరమైన విషయాలు వెలుగు చూశాయని వెల్లడించారు. ఈ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రజల కోసం చేసినట్టుగా లేదని, వారి జేబులు నింపుకోవడానికి చేసినట్టుగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, డాక్టర్ మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీఎంహెచ్ఓ వాణి పాల్గొన్నారు.

మంత్రుల నోట వైఎస్ అభివృద్ధి మాట

దేశ చరిత్రలోనే పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి తీసుకున్న నిర్ణయాలను మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ కొనియాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదలకు వైఎస్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి అధిక ప్రాధాన్యం ఇచ్చారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అంతే ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. పేదల సంక్షేమానికి కృషి చేసిన వైఎస్ సేవలు మరచిపోలేమన్నారు.

స్కిల్స్ వర్సిటీలో భాగస్వాములు కండి

▶ మొదటి పేజీ తరువాయి

ఉందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటి నుంచి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టిసారిస్తుందని తెలిపారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి, 2028 ఒలింపిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణ అందిస్తుందని చెప్పారు.

పట్టాలు ముఖ్యం కాదు.. నైపుణ్యం కావాలి

డిగ్రీ, పీజీ పట్టాలు ఉంటే సరిపోదని, ఏటేటా లక్షలాది మంది యువకులు డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, అందరూ ఉద్యోగాలు సాధించలేక పోతున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది యువకులు ఒక ఉద్యోగం ఇప్పించమని తన వద్దకు వస్తున్నారంటూ తనకు ఎదురైన కొన్ని అనుభవాలను వివరించారు. ఇదే సమయంలో పరిశ్రమలు మానవ వనరుల కొరతను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఈ అంతరాన్ని తొలిగించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాలని, తద్వారా యువత ఉపాధికి ఢోకా ఉండదని భావించినట్లు తెలిపారు.

ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్: దుద్దిళ్ల

స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించి పలు కీలక అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకుందని అన్నారు. ఇందులో భాగంగా కొత్తగా ఫ్యూచర్ సిటీని నెలకొల్పుతోందని, ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని చెప్పారు. ముఖ్యమంత్రి స్వీయ ఆలోచనతో త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ లో కొత్త కోర్సులు ప్రారంభమవటం ఆనందంగా ఉందన్నారు.

సీఎం ఆలోచనలో దార్శనికత ఉంది: ఆనంద్ మహీంద్రా

తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన గొప్పదని ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. ప్రభుత్వాలు సబ్సిడీలు, ఆకర్షణీయమైన పథకాలకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తాయని, కానీ యువతను నిపుణులుగా తీర్చిదిద్దాలని భావించడంలో దార్శనికత ఉందన్నారు. అతి పెద్ద యూఎస్ కాన్సులేట్ తెలంగాణలో ఉందని, ఇక్కడి నుంచే అమెరికాకు ఎక్కువ మంది వెళుతున్నారని తెలిపారు. స్కిల్స్ వర్సిటీలో దసరా పండుగ తర్వాత కోర్సులు ప్రారంభించనున్నట్లు బోర్డు తెలిపింది. సమావేశంలో బోర్డు కో చైర్మన్ శ్రీనిరాజు, సభ్యులు పి.దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బోర్డు సభ్యులు మనీష్ సభర్వాల్, సంజీవ్ బిక్చందానీ, ఎంఎం మురుగప్పన్, డాక్టర్ కేపీ కృష్ణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

జిల్లా వార్తలు

సింగరేణిలో ముగ్గురు అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ముగ్గురు అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎడ్యుకేషన్ జీఎం నికోలస్‌ను కార్పొరేట్ ఈఈ సెల్ జీఎంగా, విజయవాడలోని అప్మెయిల్ వింగ్‌లో డీజీఎంగా విధులు నిర్వర్తిస్తున్న గుండా శ్రీనివాస్‌ను సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా నియమించారు. అలాగే, కార్పొరేట్ ఈఈ సెల్ జీఎం కవితానాయుడుకు జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం)గా పూర్తి బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గురుకులాల్లో అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం రూరల్/రఘునాథపాలెం: గురుకుల పాఠశాలల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్, రఘునాథపాలెంలోని గురుకులాల్లో గురువారం నిరసన తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులందరికీ 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, వార్డెన్లు, కేర్ టేకర్లను నియమించడంతో పాటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను జారీ చేయాలని, గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధనకు బుధ, గురువారం నిరసన తెలపగా, 22, 23వ తేదీల్లో కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తామని తెలిపారు. అయినా స్పందన రాకపోతే ఈనెల 28న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు రవి వెల్లడించారు. ఈ నిరసనలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.వెంకన్నతో పాటు లివింగ్ స్టన్, నాగమణి, అనిత, భవాని, ఎం.మహేష్, పద్మ, ఉద్దండు పాల్గొన్నారు.

రేపు పెద్దమ్మతల్లి గుడిలో వేలం పాటలు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో వివిధ పనులు అప్పగించేందుకు ఈనెల 21న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఆలయ సముదాయంలోని నూతన కాంప్లెక్స్‌లో 1, 2, 11వ నంబర్ షాపులు మూడేళ్లకు, పాత కాంప్లెక్స్‌లోని మూడోనంబర్ షాప్‌ను 11నెలల కాలపరిమితితో వేలం ఉంటుందన్నారు. అలాగే, పూలదండలు, పోగుచేసిన తలనీలాల అమ్మకం, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే లైసెన్స్ కేటాయించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు శనివారం ఉదయం 10.30 గంటల్లోగా రూ.200 చెల్లించి దరఖాస్తు తీసుకున్నాక నిర్ణీత ధరావత్తు చెల్లించి టెండర్లలో పాల్గొనవచ్చని వెల్లడించారు.

లోపాలు.. వాహనదారులకు శాపాలు

అస్తవ్యస్తంగా జాతీయ రహదారి

- సారపాక – రుద్రంపూర్ మార్గంలో తొమ్మిదేళ్ల క్రితం పనులు ప్రారంభం
- మూడో ప్యాకేజీ కింద రూ.299 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఇప్పటివరకు పూర్తికాక వాహనదారుల ఇక్కట్లు



సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సమీపంలో నెర్రెలు బారిన ప్రధాన జాతీయరహదారి



హైవేపై పేరుకపోయిన మట్టి, ఇసుక



నవభారత్ కల్వర్టు వద్ద ప్రమాదకరంగా గుంతలు

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా వెళ్తున్న 30వ నంబర్ జాతీయ రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఏళ్ల తరబడి చేపడుతున్నా పనులు పూర్తికాక.. పూర్తయిన చోట రహదారి నెర్రెలు బారి వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇక ఫుట్‌పాత్‌ల పరిస్థితి అలాగే ఉండగా.. రోడ్డుపై చాలా చోట్ల ఇసుక, మట్టి చేరి ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అయినా రహదారి నిర్మాణం పూర్తిచేయడంపై అటు కాంట్రాక్టర్ ఇటు హైవే అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనికి తోడు ఇదే రహదారిపై తరచుగా రాకపోకలు సాగించే ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించకపోవడం గమనార్హం.

2015లో మొదలైన రోడ్డు పనులు

సారపాక నుంచి రుద్రంపూర్ వరకు మూడో ప్యాకేజీ కింద రూ.299 కోట్ల వ్యయంతో 42 కిలోమీటర్ల జాతీయ రహదారి మంజూరైంది. ఈ పనులను 2015లో మొదలుపెట్టగా 2017 నాటికి పూర్తిచేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్టు సంస్థ తీరుతో ఇప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధాన రహదారి పనులను మూడేళ్ల క్రితం పూర్తిచేసినా డ్రెయినేజీలు, ఫుట్‌పాత్‌లు పూర్తిస్థాయిలో చేపట్టలేదు.

లోపాలు అనేకం..

పాల్వంచ మండలం కేశవాపురం వద్ద కల్వర్టు సమీపాన రోడ్డు కుంగిపోగా తిరిగి మరమ్మతులు చేశారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సమీపాన రోడ్డు నెర్రెలు బారింది. ఫుట్‌పాత్ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా చేపట్టారు. ఇటీవల కొత్తగూడెంలోని ముర్రేడువాగు వద్ద బ్రిడ్జిపై ఫుట్‌పాత్ ఇప్పటికే గుంతలు తేలింది. కేశవాపురం వద్ద కల్వర్టుపైన ఫుట్‌పాత్ కుంగిపోగా, కేశవాపురం, బస్వతారక కాలనీ, ఇందిరనగర్ కాలనీలో ఫుట్‌పాత్‌పై ఇటుకలు పగలిపోతున్నాయి. అలాగే, నవభారత్ వద్ద కల్వర్టు పనులు పూర్తిచేయలేదు. మొత్తంగా 54 కి.మీ. మేర ఫుట్‌పాత్ నిర్మాణంలో ఇంకా 20 కి.మీ. పూర్తి చేయాల్సి ఉండడం గమనార్హం.

ప్రమాద సూచికలు ఏవీ?

జాతీయ రహదారిపై మధ్యలో చాలా చోట్ల డివైడర్లు నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. అంతేకాక మూలమలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక 'సీ'కాలనీ గేట్, నవభారత్, ఇందిరానగర్, పెద్దమ్మగుడి, జగన్నాధపురం గ్రామాల వద్ద ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు దాటేలా డివైడర్లు వదిలేశారు. మిగిలిన చోట్ల డివైడర్ల నిర్వహణ సరిగ్గా లేక మొక్కలు ఏపుగా పెరిగి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

నేడు సమావేశం ఉంది..

హైవే పనులు 80శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులపై కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చాం. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగే సమావేశంలో చర్చించి పూర్తయ్యేలా చూస్తాం. డివైడర్ మధ్యలో కొమ్మల తొలగింపు, రోడ్డు పరిశుభ్రత బాధ్యత మున్సిపాలిటీదే. – యుగేందర్, ఎన్‌హెచ్ ఈఈ

ప్రమాదకరంగా మారింది...



పెద్దమ్మ గుడి నుంచి కొత్తగూడెం వరకు నిర్మించిన జాతీయ రహదారి గందరగోళంగా ఉంది. రెజీనా కాన్వెంట్ వద్ద ఓ వైపు ఎత్తుగా, మరోవైపు తక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల రోడ్డుపై పగుళ్లు ఉన్నా పట్టించుకోవడంలేదు. – గద్దల రమేష్, దంతలబోరు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



జాతీయ రహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నారు. డివైడర్ మధ్యలో చెట్ల కొమ్మలు కట్ చేయక వాహనదారులకు తగులుతున్నాయి. దీనికితోడు రోడ్డుపై చాలాచోట్ల ఇసుక, మట్టి పేరుకుపోయింది. – సారయ్య, పాల్వంచ

'కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి'

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం ప్రతిఘటించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల స్థాయి సదస్సు ఖమ్మంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్ల మోదీ పాలన ప్రజా వ్యతిరేకంగా, కార్పొరేట్ల అనుకూలంగా కొనసాగగా, మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తీరు మారలేదని చెప్పారు. రెండు ఐఎఫ్‌టీయూల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఆర్.జనార్ధన్, నాయకులు ఐ.వెంకన్న, ఎండీ. రాసాద్దీన్, జె.సీతారామయ్య, గంటా నాగయ్య, కొక్కు సారంగపాణి,గంగుల దయాకర్, శివారపు శ్రీధర్, ఎస్‌కే.సుబాహన్ తోడేటి నాగేశ్వరరావు, దుబాకుల ప్రసాద్, పటేల్, బోడ నాగేశ్వరరావు, గోపి, రవి, కాంపాటి మధు, ఎల్.క్రాంతి పాల్గొన్నారు.

వ్యవస్థలను చెప్పుచేతుల్లో పెట్టుకునేందుకే 'జమిలి'

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రీకృత వ్యవహారాలు, వ్యవస్థలను చెప్పుచేతుల్లో పెట్టుకునేందుకే దేశంలో జమిలి ఎన్నికలను తీసుకురావాలని బీజేపీ చూస్తోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ దేశం ఫెడరల్ వ్యవస్థతో కూడి ఉందని, భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని చెప్పారు. ఈనేపథ్యాన రాష్ట్రాల్లో ప్రత్యేక పరిస్థితులు, అనేక హక్కులు కలిగి ఉన్నాయన్నారు. కానీ బీజేపీ మాత్రం స్వార్థంతో ఒకే జాతి, ఒకే జెండా పేరిట జమిలీ ఎన్నికల విధానాన్ని తీసుకురావాలనే యత్నాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. అధికారం, ఎన్నికల వ్యవస్థను బీజేపీ తన గుప్పెట్లో పెట్టుకోవాలనే ఆలోచనలో ఉందని చెప్పారు. కాగా, జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక సమాజాన్ని కొనసాగింపుగా ఈ నెల 24 నుండి 30వ తేదీ వరకు రాష్ట్రంలో పార్టీ ఆధ్వర్యాన ప్రచారం నిర్వహిస్తున్నట్లు రంగారావు తెలిపారు. జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఖమ్మంలో చెరువు స్థలాలు, నాలాలు, వాగులను ఆక్రమించడంతోనే ఇటీవల వరద తీవ్రత పెరిగినందున నక్షాల ప్రకారం హద్దులు నిర్ణయించాలన్నారు. ఇక కొందరు కార్పొరేటర్ల భర్తల ఆగడాలు పెరిగిపోయాయని, వారి తీరు మార్చుకోవాలని హితవు పలికారు. అలాగే, అధికారులు ఆక్రమణల తొలగింపులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీ.వై.పుల్లయ్య, ఆవుల అశోక్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

మావోయిస్టు నేతలు అరుణ, ఆజాద్ పిలుపు

చర్ల: ఈనెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు జరిగే మావోయిస్టు పార్టీ 20వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ చర్ల – శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ, భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వారు వేర్వేరుగా లేఖలు విడుదల చేశారు. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్న కార్మికవర్గంతో కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ని స్థాపించి 2024 సెప్టెంబర్ 21 నాటికి 20 సంవత్సరాలు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా బ్రాహ్మణీయ, హిందూత్వ ఫాసిజాన్ని ఓడించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకొని ప్రజలపైనా, ప్రజల పక్షాన పోరాడుతున్న మావోయిస్టు పార్టీపైనా దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. మావోయిస్టు పార్టీని నిర్మూలించే కగార్ దాడి పథకాన్ని ఓడించేందుకు ప్రజలంతా ఐక్యం కావాలని కోరారు.

ఖమ్మం చేరిన ఈపీఎఫ్ పెన్షనర్ల పాదయాత్ర

ఖమ్మంమయూరిసెంటర్: ఈపీఎఫ్ఓ చందాదారులకు ఉద్యోగ విరమణ తర్వాత వాస్తవ వేతనంపై అధికంగా పింఛన్ మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఈపీఎస్–95 పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన గుంటూరు నుంచి ఢిల్లీ వరకు పాదయాత్ర చేపట్టా రు. రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యాన కొనసాగుతున్న యాత్ర గురువారం ఖమ్మం చేరింది. ఈ సందర్భంగా రిటైర్డ్ అధికారి సత్యనారాయణశర్మ, ఆర్టీసీ కండక్టర్లు బీఎస్.రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, స్టేషన్‌మేనేజర్ అనిల్‌కుమార్, కంట్రోలర్లు దేవయ్య, టి.రామారావు తదితరులు కలిసి సంఘీభావం తెలిపారు.



మురళీకృష్ణతో ఆర్టీసీ ఉద్యోగులు

నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం



దాతకు రశీదు అందజేస్తున్న ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం ఓ భక్తుడు విరాళం అందజేశారు. హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన గుమ్మలూరి రమణమూర్తి రూ.50 వేల చెక్కును ఆలయ అధికారులకు అందించి కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రసాదంతో పాటు జ్ఞాపిక అందజేశారు.